

టీడీపీ జమానా అవినీతిమయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో స్కీములు ఉండగా.. టీడీపీ జమానాలో అన్నీ స్కాములే ఉన్నాయని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు.

- 8లో..



యాదవులకు అండగా వైఎస్సార్ సీపీ

యాదవ సామాజికవర్గానికి అండగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

ఖాకీల పచ్చపాతం..!

ఎన్నికల సంఘం ఆధీనంలో రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాల్సిన పోలీస్ వ్యవస్థ 'పచ్చ'పాతంగా వ్యవహరిస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఎల్లోమీడియాలో వచ్చే వార్తల ఆధారంగా, తెలుగుదేశం పార్టీ చేసే విమర్శలనే ప్రామాణికంగా తీసుకుంటూ ఏక పక్షంగా వ్యవహరిస్తూ రాజకీయ వివాదాలకు ఆజ్యం పోస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఒంగోలు నగరంలో జరిగిన ఘటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. గిద్దలూరులో జరిగిన సంఘటనను సాకుగా చూపి ఎస్పీని బదిలీ చేయడంతో పోలీసులు ఎన్నికల కమిషన్‌కు భయపడి రివర్స్‌గేర్‌లో వెళుతున్నట్టుగా ఉందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

- పోలీసులు ఎవరికి భయపడుతున్నారు..?
- ప్రశాంతంగా జరుగుతున్న వైఎస్సార్ సీపీ ప్రచారాన్ని అడ్డుకున్నది ఎవరు...
- అడ్డుకున్న వారిని వదిలి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారు
- సాక్షాత్తూ ఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేస్తేనే టీడీపీ వాళ్లపై కేసులు లేవు
- ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ సానుభూతి పరులైన కానిస్టేబుల్ కుటుంబంపై చర్యలేవీ?
- ఎన్నికల కమిషన్ మెప్పు కోసమేనా అన్న అనుమానాలు



ఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు



ఎస్పీ ఆఫీసు ముందు ధర్నా చేసేందుకు తన అనుచరులతో వెళుతున్న దామచర్ల జనార్దన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎన్నికల నిబంధనలు కేవలం అధికార పార్టీకే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారంటూ జిల్లా ఎన్నికల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేయడం, వారి అనుకూల మీడియాలో వార్తలు అచ్చేయడం ఆలస్యం..ఎన్నికల అధికారులు ఆఘమేఘాలపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అదే అధికార పార్టీ ఫిర్యాదులు పట్టీపట్టనట్టుగా ఉంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో జతకట్టిన టీడీపీ, జనసేన నాయకులంటే ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చిన తర్వాత గిద్దలూరు పట్టణంలో జరిగిన హత్యకు ప్రతిపక్షాలు, వారి అనుకూల పచ్చ మీడియా రాజకీయ రంగును పులిమాయి. ఆ హత్య వెనుక వ్యక్తిగత కారణాలు ఉన్నా పట్టించుకోకుండా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అధికారులు నిబంధనల అమలు విషయంలో రివర్స్‌గేర్‌లో వెళ్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలపై అధికారులు స్పందిస్తున్న తీరును పరిశీలిస్తే ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టీడీపీ నాయకులకు, సాక్షాత్తు మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌కు ఎన్నికల నియమావళి నిబంధనలు వర్తించవా...? మాజీ మంత్రి, ఒంగోలు ప్రస్తుత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మీడియా వేదికగా అధికారులను నిలదీశారు. ఎస్పీ కార్యాలయం ముందు నిబంధనలకు విరుద్ధంగా దామచర్ల ఆధ్వర్యంలో ధర్నా చేస్తే టీడీపీ వాళ్లపై కేసు లేదు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు ధర్నాలు, నిరసనలు చేయాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. దానికి తోడు ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంది. ఈ సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ముందస్తుగా ఒంగోలు డీఎస్పీ వద్ద నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. టీడీపీ నాయకులు అలాంటి అనుమతులు తీసుకోలేదు. ఒక వేళ అనుమతి అడిగినా ఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేసేందుకు పోలీసులు అనుమతిస్తారా...?. ఎందుకు ఈ వివక్ష చూపుతున్నారు పోలీసులు. ఎవరికి భయపడుతున్నారు. ఎందుకు భయపడుతున్నారు. దానికి తోడు ఎస్పీ స్పందించకపోతే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి మరీ

- మిగతా 12లో ▶

న్యూసెన్స్‌తో లబ్ధిపొందాలనేదే టీడీపీ కుట్ర



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన బాలినేని శ్రీనివాసరెడ్డి, పోతుల సునీత, టీజేఆర్, బూచేపల్లి

- టీడీపీకి సానుభూతి కోసమే ఒంగోలులో ఘటన
- వివాదానికి కారణమైన మహిళ మాట్లాడిన మాటలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయి
- కులాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని టీడీపీ భావిస్తోంది
- మేము నమ్మేది ప్రజలనే...ఓటుతో చెంప చెళ్లుమనిపించే రోజు దగ్గరలోనే ఉంది
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: రోజురోజుకూ ప్రజాభిమానం కోల్పోయిన తెలుగుదేశం పార్టీ చివరకు న్యూసెన్స్ సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక కేబీ రెస్టారెంట్‌లో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని శుక్రవారం ఆయన కలిశారు. అనంతరం చెవిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేవలం సానుభూతి కోసం టీడీపీ స్థానిక సమతానగర్‌లో ఘటనను సృష్టించిందన్నారు. హుందాగా వ్యవహరిస్తూ బొట్టుపెట్టి

- మిగతా 12లో ▶

ప్రకాశించిన ప్రతిభ

- ఇంటర్మీడియెట్‌లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాదే అత్యధికం
- సీనియర్ ఇంటర్‌లో 15వ స్థానం, జూనియర్ ఇంటర్‌లో 18వ స్థానం
- ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

ఒంగోలు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించింది. ర్యాంకుల సాధనలో తడబడినా ఉత్తీర్ణతలో జనరల్, ఒకేషనల్ విభాగాల్లో గత అయిదేళ్ల రికార్డును తిరగరాసినట్లయింది. కొండపి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని తన్నీరు దివ్య ఏకంగా 975 మార్కులు కైవసం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచింది. గత ఏడాది వరకు ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో జరిగాయి. 13 జిల్లాలకు సంబంధించి

- మిగతా 12లో ▶

నిబంధనలు పాటించాలి

- నామినేషన్ల కోసం హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు
- ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి
- అక్రమంగా సరఫరా, నిల్వ ఉన్న రూ.130 లక్షల నగదు, వస్తువులు సీజ్
- విలేకర్ల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్

- మిగతా 12లో ▶

జిల్లాకు చేరిన జీవ జలం

- జిల్లా తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు
- జిల్లాకు చేరిన 21 వందల క్యూసెక్కులు
- ఈనెల 18 వరకు నీటి సరఫరా



త్రిపురాంతకం వద్ద సాగర్ ప్రధాన కాలువ ద్వారా వస్తున్న సాగర్ జలాలు

త్రిపురాంతకం: జిల్లా ప్రజలకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు జిల్లా సరిహద్దు 85-3 మైలు వద్ద 21 వందల క్యూసెక్కుల మేర సరఫరా అవుతున్నాయి. ఈనెల 18వ తేదీ వరకు నీటి సరఫరా జరగనుంది. నాగార్జున సాగర్ పరివాహకంలోని తాగునీటి చెరువులు, ఎస్ఎస్ ట్యాంకులు నింపేందుకు సాగర్ జలాలు ప్రభుత్వం విడుదల చేసింది. ఈనీటితో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వినియోగించనున్నారు. చుక్కనీరు కూడా లీకేజి కాకుండా మేజర్ల పరిధిలో తూములను మట్టి కట్టలు వేసి పూర్తిగా నిరోధించారు. జిల్లాలో ఒంగోలు, రామతీర్థం జలాశయాలకు ఈనీటిని తరలించే ఏర్పాట్లు చేశారు. సాగర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో మేజర్ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. రానున్న మూడు నెలలను దృష్టిలో ఉంచుకుని ట్యాంకులు నింపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 18 వ తేదీ వరకు సుమారు 5 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

మామిడి తోట దగ్ధం



కాలిపోయిన మామిడి తోట

దర్శి: మండలంలోని తిమ్మాయి పాలెం గ్రామంలో నాలుగు ఎకరాల వరిగడ్డి, నాలుగు బోర్లు, ఎకరా మామిడి తోట దగ్ధమై రూ.11 లక్షల ఆస్తినష్టం సంభవించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు సవలం గంగయ్య, పెద్దఅంకమ్మ, కలివేల శాంతమ్మ తెలిపిన వివరాల మేరకు కాలువ పక్కన ఎండలకు ఎండిన గడ్డి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పువేశారు. ఆ నిప్పు రాజుకుని చేలో ఉన్న నాలుగు ఎకరాల వరిగడ్డి, ఎకరాలో ఉన్న 10 సంవత్సరాల వయస్సున్న మామిడి తోట, నాలుగు బోర్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు కన్నీరు మున్నీరై విలపించారు. కాయలున్న తోట కాలిపోవడంతో నోటికాడ కూడు పోయిందని విలపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ జమానా అవినీతిమయం

- ప్రజలకు ఏం చేశారో, ఏమి చేస్తారో చెప్పే దమ్ము కూటమికి లేదు
- చంద్రబాబులా మాటిచ్చి తప్పే వ్యక్తిత్వం జగనన్నది కాదు
- దేశంలో 99 శాతం హామీలు అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- దర్శి వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశంలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సమావేశానికి భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సత్కరిస్తున్న నాయకులు

దర్శి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసేందుకు అమ్మఒడి, ఆసరా, చేయూత, కాపునేస్తం, పేదలకు ఇళ్లు తదితర స్కీములను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడితే.. చంద్రబాబు మాత్రం అమరావతి భూములు, మద్యం, ఇసుక, నీరు–చెట్టు కుంభకోణాలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ లాంటి స్కాములతో రాష్ట్రాన్ని దోచేశాడని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ జమానాలో ప్రజలకు ఏం చేశారు, అధికారంలోకి వస్తే ఏం చేస్తారో సరిగ్గా చెప్పకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని చంద్రబాబు అండ్ కోపై నిప్పులు చెరిగారు. శుక్రవారం దర్శి మండల వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం ఇక్కడి బూచేపల్లి నివాసం వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చెవిరెడ్డితోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందిని దంపతులకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. చెవిరెడ్డిని స్టేజీ పైకి ఆహ్వానించగా తానూ కార్యకర్తనేనని కొంతసేపు వారి పక్కనే కూర్చుని ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. బూచేపల్లి వెంకాయమ్మ నన్ను తన సొంత బిడ్డలా ఆదరిస్తున్నారని, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నా తమ్ముడని పేర్కొన్నారు. పరిపాలనపై పీహెచ్‌డీ చేసిన తాను చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా 5096 పనులను రూ.972 కోట్లతో పూర్తి చేశానని చెప్పారు. పూర్తి చేసిన పనుల వివరాలతో పుస్తకం ప్రచురించి మొదటి కాపీని టీడీపీ, జనసేన పార్టీలకు పంపి సవాల్ విసిరానని గుర్తు చేశారు. పదవులు అడ్డం పెట్టుకుని వ్యాపారాలు చేసుకునే వ్యక్తిని కాదని, తనకు తెలిసింది ప్రజలకు సేవ చేయడమేనని ఉద్ఘాటించారు. నా సోదరుడు శివతో దర్శి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఒంగోలు ఎంపీగా తనను, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా శివప్రసాద్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో తన భర్త బూచేపల్లి సుబ్బారెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీలో చేరాలంటూ తమ ఫ్యాక్టరీలు మూయించి ఇబ్బంది పెట్టినా జగన్ వెంటే నడిచామని గద్గద స్వరంతో అన్నారు. తండ్రి ఆశయ సాధనే లక్ష్యంగా అక్కడ జగనన్న, ఇక్కడ మీ శివన్న పని చేస్తున్నారని, అందరూ అండగా నిలిచి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి రావడం మన అదృష్టమన్నారు. దర్శి నియోజకవర్గ ప్రజలకు తాను పెద్ద వలంటీర్‌గా సేవలందిస్తానని కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నాయకుడు ఎలా ఉండాలో జగనన్నను చూసి నేర్చుకోవాలని.. ఎలా ఉండకూడదో చంద్రబాబును చూసి నేర్చుకోవాలని చెప్పారు.

వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. 40 ఏళ్ల అనుభవముందని డప్పు కొట్టే చంద్రబాబు.. జనసేన, బీజేపీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారో ఆలోచించాలన్నారు. సేవాగుణం కలిగిన బూచేపల్లిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం భాషా, ఎంపీపీ గోళ్ళపాటి సుధా అచ్చయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబు రావు, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, ఆవుల జ్యోతి శివారెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీరెడ్డి, మాజీ సాగర్ ప్రాజెక్ట వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి,మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, వ్యవసాయవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మారెడ్డి సుబ్బారెడ్డి,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్, వార్డు ఇంచార్జులు అంకాల శ్రీను,చెరుకూరి జగన్, అన్నవరపు రవి,కర్నా భాస్కర్‌రెడ్డి, చింతపూడి శ్రీనివాసరెడ్డి, కొడవటి జాన్, గర్నెపూడి సామ్యేల్, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు అండగా వైఎస్సార్ సీపీ



ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌కు గొర్రెపిల్లను అందజేసి గజమాలతో సత్కరిస్తున్న యాదవులు

- ఉమ్మడి ప్రకాశంలో యాదవులకు రెండు అసెంబ్లీ స్థానాలు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలులో ఉత్సాహంగా యాదవుల ఆత్మీయ సమ్మేళనం

ఒంగోలు: యాదవ సామాజికవర్గానికి అండగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు లోని గోపాల్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళనంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల పక్షపాతి అని కొనియాడారు. గతంలో చంద్రబాబు బీసీలకు అది చేస్తా, ఇది చేస్తానని చెప్పాడు కానీ చివరికి చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో రజకులు, నాయీబ్రాహ్మణులను చంద్రబాబు దూషించి, బెదిరించిన విషయాన్ని గుర్తు చేశారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా కుట్రలు చేసిన చంద్రబాబు రాష్ట్రంలో 33 మంది వృద్ధుల ప్రాణాలు బలితీసుకున్నాడని నిప్పులు చెరిగారు. చంద్రబాబు జమానాలో ప్రతి నెలా 7 లేదా 8వ తేదీల్లో ఆఫీసుల చుట్టూ తిప్పించుకుని పింఛను ఇచ్చాడని, ఏనాడైనా ఒకటో తేదీ ఇచ్చాడా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంకగా మారిపోతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. మళ్లీ అమలు సాధ్యం కాని హామీలు గుప్పిస్తూ ప్రజలకు మభ్యపెడుతున్నాడని మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కనిగిరి, కందుకూరు అసెంబ్లీ స్థానాలను యాదవులకు కేటాయించడం బీసీలపై వైఎస్ జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని కోరారు.

సంస్కార హీనుడు దామచర్ల

ఒంగోలులో ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవ చేస్తున్న తానేంటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. సమతానగర్‌లో తన కోడలు శ్రీకావ్య ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని బూతులు తిట్టారని, గతంలో కమ్మపాలెంలోనూ ఇలాగే తనను అడ్డగించి యాగీ చేశారని టీడీపీ నాయకుల తీరును తూర్పారబట్టారు. దామచర్ల జనార్దన్ కూతురు, భార్యకి ఇలాగే జరిగితే ఊరుకుంటాడా అని బాలినేని నిలదీశారు. తాను దామచర్ల జనార్దన్‌లా సంస్కార హీనుడిని కాదని చెప్పారు.

రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ.. ఇది యాదవ ఆత్మీయ సభ కాదని బాలినేని విజయోత్సవ సభ అని అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బీసీలకు 48 అసెంబ్లీ సీట్లు, 11 ఎంపీ సీట్లు కేటాయించిందని, వీటిలో ఎక్కువ భాగం యాదవులే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి యాదవులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్, ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా బాలినేనిని గజమాలతో సత్కరించి, మేకపిల్లలను బహుమతిగా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు కటారి శంకర్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు, కార్పొరేటర్లు ఎందేటి పద్మావతి రంగారావు, చల్లా తిరుమలరావు, యనమల నాగరాజు, గండు ధనలక్ష్మి మధు, జెడా వెంకటేష్, కండే స్వాతి రమణయ్య యాదవ్, అంగిరేకుల గురవయ్య, నాగం వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కటారి ప్రసాద్, మోడుబోయిన సురేష్‌యాదవ్, కుట్టుబోయిన కోటియాదవ్, చల్లా శ్రీనివాసరావు, మహాలక్ష్మి దేవాలయం చైర్మన్ ఎందేటి వెంకట్రావు, పటాపంజుల శ్రీనివాసరావు, తుముకూరు హనుమంతరావు(దొర), రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, కోనంకి ఆదిలక్ష్మి, ఎందేటి వెంకట్రావు, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల కృష్ణ, బొమ్మినేని మురళి, యర్రాకుల శ్రీనివాసరావు యాదవ్, చావలి శివప్రసాద్, బొంతా గంగాధర్, జమ్ము శ్రీకాంత్, సీహెచ్ నాగబాబు, తాళ్లపాలెం శ్రీను, నాగం వెంకట్రావు, పల్లపోలు మోహన్, జమ్ము రత్తయ్య, జాజుల శ్రీను, పందిళ్ల ఆంజనేయులు, మూగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 కుటుంబాలు చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 టీడీపీ కుటుంబాలు శుక్రవారం మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణ టీడీపీ ఉపాధ్యక్షురాలు, మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు సయ్యద్ మల్లికా ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అన్నా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో చేరిన కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరడం సంతోషమన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, డాక్టర్ మగ్బుల్‌బాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, కరీంబాషా, కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు, రహ్మతుల్లా, మాజీ వైస్ చైర్మన్ షేక్ షెక్షావలి, రఘుపతి శివ, కె.ఆది పాల్గొన్నారు.

టీడీపీ వాళ్లు శుద్ధపూసలా?

- సమతానగర్ ఘటనలో పది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అరెస్ట్
- ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- సమాచారం తెలుసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకున్న ఎమ్మెల్యే బాలినేని
- బాలినేని నిలదీశాకే టీడీపీ కార్యకర్తలను తీసుకొచ్చిన పోలీసులు
- స్టేషన్ వద్ద మూడు గంటలపాటు హైడ్రామా
- ఇరుపార్టీలకు చెందిన 20 మందికి సెక్షన్ 41 నోటీసులిచ్చి పంపిన వైనం



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే బాలినేని, పార్టీ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు సమతానగర్‌లో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ నాయకులు అడ్డుకుని ఘర్షణకు దిగిన ఘటనకు సంబంధించి వరుస అరెస్టులతో ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద హైడ్రామా నడిచింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలే లక్ష్యంగా శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ తమ సిబ్బందితో హడావుడి సృష్టించారు. కార్యకర్తలు లేకపోతే వారి తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టారు. కొంత మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఇరుపార్టీల కార్యకర్తలపై కేసులుండగా కేవలం వైఎస్సార్ సీపీ వారినే అరెస్టు చేయడమేంటని పోలీసులను బాలినేని నిలదీశారు. తనను కూడా అరెస్ట్ చేయండి అని బాలినేని భీష్మించడంతో అప్పటికప్పుడు టీడీపీకి చెందిన పలువురిని అరెస్టు చేసి టూటౌన్ స్టేషన్‌లో ఉంచారు. బాలినేని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని తెలియడంతో నగరంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

హై డ్రామా

అరెస్టయిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వదిలిపెట్టేదే లేదు, కోర్టులో హాజరుపరుస్తామని ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు తెగేసి చెప్పారు. దీనిపై బాలినేని స్పందిస్తూ.. 41 నోటీసులివ్వాల్సిన కేసులో ఏం తప్పుచేశారని కోర్టుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు. ఈలోగా ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్వీ శ్రీధర్‌రావు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు ఉన్నారు. చివరకు సెక్షన్ 41 నోటీసులిచ్చి పంపుతామని ఏఎస్పీ నాగేశ్వరరావు చెప్పడంతో బాలినేని అక్కడ నుంచి వెనుదిరిగారు. వైఎస్సార్ సీపీకి చెందిన 10 మంది, టీడీపీకి చెందిన 10 మందికి సెక్షన్ 41 నోటీసులిచ్చి వదిలిపెట్టారు.

ఓటమి భయంతోనే దాడులకు కుట్ర

- దాడుల సంస్కృతి మారదా.. చంద్రబాబు నాయుడూ..
- ఇంకెంతకాలం ఈ బరితెగింపు?
- ఒంగోలు ఘటనపై మంత్రి మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్ ఆగ్రహం



మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు/చీమకుర్తి: టీడీపీ దాడుల సంస్కృతి, బరితెగింపునకు ఒంగోలు సంఘటనే తార్కాణమని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. ఒంగోలులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మహిళలపై టీడీపీ నేతలు దాడులకు తెగబడటంపై మంత్రి స్పందించారు. ×దాడుల సంస్కృతి మారదా చంద్రబాబూ.. ఎంతకాలం ఈ బరితెగింపు?× అంటూ ధ్వజమెత్తారు. వలంటీర్లపైన, ప్రచారానికి వెళ్లిన మహిళలపై టీడీపీ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఓడిపోతామనే భయంతోనే చంద్రబాబు, లోకేష్ దాడులకు తెరదీశారని దుయ్యబట్టారు. సౌమ్యుడైన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు దూషించడం హేయమని, ఆ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దుయ్యబట్టారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్న బాలినేని కుటుంబ సభ్యులనుటీడీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషించడం, దురుసుగా ప్రవర్తించడం జుగుప్సాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. వివాదాలు సృష్టించడం, ఆపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం టీడీపీ నేతలకు రివాజుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసా రాజకీయాలకు వైఎస్సార్ సీపీ దూరమని స్పష్టం చేశారు. ఒంగోలులో ఎవరేమిటో ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మంత్రి పేర్కొన్నారు.

టీడీపీ ప్రచారంలో పారిశుధ్య కార్మికుడు



టీడీపీ ప్రచారం సభలో మధుబాబు

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె గ్రామంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామ సచివాలయ పారిశుధ్య ఒప్పంద కార్మికుడు కొమ్మునూరి మధుబాబు పాల్గొని కోడ్ ఉల్లంఘించాడు. ఆయనపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి

ఒంగోలు సెంట్రల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ సంక్షేమాధికారి లక్ష్మానాయక్ తెలిపారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని హెచ్‌సీఎం కళాశాల ఎదురుగా, అంబేడ్కర్ భవన్‌కు వెళ్లే దారి ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని చెప్పారు. జిల్లా అధికారులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.